క్లుప్తంగా

నీట్ పరీక్షలో యానాం విద్యార్థుల ప్రతిభ

యానాం: యానాం రీజెన్సీ **జూనియర్ కళా**శాల విద్యార్థులు నీట్ పరీక్ష**లో విశేష ప్రతిభ** చూపారని బుధవారం ప్రిన్సి**పాల్ మార్తాండ** ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. **ఆర్ ప్రేరిత** 555 మార్కులు, మనోవెంక**టేష్ 491, పీవై** ప్రవీణ 485, కె.ఖ్యాతి 435, కె.భవ్యశ్రీ 430, కె.హేమ 418, సీహెచ్ నాగలావణ్య 390, పి.చంద్రిక 377, టి.తేజస్విని 369, ఎం.ప్రవీణ్ 334, కె.హసీన్‌బిందు 265, ఎస్ జెస్సికా 257, జి.లక్ష్మీఅఖిల 246, పి.తేజస్విని 240, ఐ.తన్మయి 180 మార్కులు సాధించారని వివరించారు. వీరిని రీజెన్సీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జీఎస్ నాయుడు, అధ్యాపకులు అభినందించారు.

చెట్లను సంరక్షించాలి: డీఎఫ్‌ఓ



కందికుప్ప అటవీ సెక్షన్‌లో మొక్కలు నాటుతున్న డీఎఫ్ఓ ప్రసాదరావు

కాట్రేనికోన: వృక్షాలను రక్షిస్తే, పర్యావరణ సమతుల్యత కాపాడబడటమే కాకుండా, ప్రాణకోటికి అవసరమైన ఆక్సిజన్ అందుతుందని జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు అన్నారు. కందికుప్ప అటవీ సెక్షన్ పరిధిలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, పర్యావరణాన్ని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రవి, కందికుప్ప డీఆర్ఓ రవి, రావులపాలెం సీఓ పట్టాభి, రాతి కాలువ అటవీ సెక్షన్ అధికారి బాలబ్బాయ్, ఎఫ్ఎస్ఓ శ్రీబాల, బీట్ అధికారులు, వన సంరక్షణ సమితుల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవకోటి మనుగడకు ముప్పు

పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్యనారాయణ



కోరంగి అభయారణ్యంలో బొలిశెట్టి సత్యనారాయణ తదితరులు

తాళ్లరేవు: పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే భవిష్యత్తులో జీవకోటి మనుగడకు ముప్పు వాటిల్లుతుందని పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోరంగి అభయారణ్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మడచెట్లు ఎక్కువగా కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకుని, ఆక్సిజన్ విడుదల చేసి ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. నదులు వెళ్లి సముద్రంలో కలిసే చోటనే మడచెట్లు జీవిస్తుందని, అందువల్ల మడ అడవులను సంరక్షించుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు చేపట్టవలసిన అంశాలను పలువురు వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి, నేషనల్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ చిలుకూరి రామ్‌కుమార్, కాకినాడ పోర్ట్ ఆఫీసర్ ధర్మశాస్త్ర, ఎస్డీఎఫ్‌టీ టి.అనూష, ఎఫ్ఆర్ఓ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, పి.ఆదినారాయణ, పి.రాజేశ్వరి, దుగ్గన బాబ్జి, కిరణ్, ఆకుల శ్రీనివాస్, ఆట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని వీడాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక వడ్డిగూడెంలోని శ్రీవాగ్దేవి స్కూలులో ప్లాస్టిక్ వాడకం–అనర్థాలు అనే అంశంపై బుధవారం చర్చా గోష్ఠి జరిగింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్కూలు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ స్థానే బయోడిగ్రేడబుల్ వస్తువులను వాడాలని స్కూలు డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి పిలుపునిచ్చారు. బజారుకు వెళ్లినప్పుడు చేతి సంచిని కూడా తీసుకెళితే, ప్లాస్టిక్ నిరోధంలో భాగస్వాములైనట్టేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌ను విస్మరిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు పెంకేవారిపేట దంప ప్రాంతానికి చెందిన చిక్కం కృష్ణ (32) బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు, స్థానిక జగనన్న కాలనీలో నివసిస్తున్న కృష్ణ బహిర్భూమికని బయటకు వెళ్లాడు. కరెంటు స్తంభం నుంచి తెగిపడిన విద్యుత్ తీగ తగలడంతో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

భవితకు పునాది

- సెలవుల్లో సరికొత్త కోర్సులు
- కంప్యూటర్ శిక్షణపై విద్యార్థుల ఆసక్తి
- స్వల్పకాలిక కోర్సులపై ప్రత్యేక దృష్టి



ముమ్మిడివరంలో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ముమ్మిడివరం: వేసవి సెలవుల్లో ఏడాది పాటు పాఠ్య పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఇప్పుడు వాటిని అటకెక్కించారు. కొంత మంది సెలవులు ఆరంభంలో బంధువుల ఇళ్లకు చెక్కేస్తే, మరికొందరు తీర్థయాత్రల బాట పట్టారు. ఇప్పుడున్న ఖాళీ సమయాన్ని విద్యార్థులు సమర్థంగా వినియోగించుకుంటున్నారు. చాలా మంది విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల్లో చేరి ఉపాధి అవకాశాలను మెరుగు పర్చుకుంటున్నారు. అలాగే స్వల్ప కాలిక కోర్సులపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో మంచి ప్రతిభ కనబర్చడానికి కంప్యూటర్ శిక్షణా కేంద్రాల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులను ఆకర్షించేందుకు శిక్షణా కేంద్ర నిర్వాహకులు వివిధ కోర్సులకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తూ ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు ఆరు కంప్యూటర్ శిక్షణా కేంద్రాలు ఉన్నాయి.

వివిధ కోర్సులు

ఈ శిక్షణా కేంద్రాల్లో కంప్యూటర్‌కు సంబంధించి ప్రాథమిక అంశాలతో పాటు, సీసీఏ, డీసీఏ, పీజీడీసీఏ, జావా, సీ లాంగ్వేజ్, టాలీ, ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, ఇంటర్నెట్, హార్డ్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో కంప్యూటర్ విద్యపై పరిజ్ఞానం పెంచుకుంటే ఉన్నత విద్య సమయంలో విద్యార్థులు మంచి ప్రతిభ చూపుతారని తల్లిదండ్రులు కూడా వారి పిల్లలకు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. అలాగే వివిధ పోటీ పరీక్షలకు కూడా శిక్షణ పొందుతున్నారు.

నామమాత్రపు ఫీజులతో..

వేసవి ఖాళీ సమయంలో వస్తున్న విద్యార్థుల కోసం పలు కంప్యూటర్ శిక్షణా సంస్థలు తక్కువ ఫీజులతోనే బోధన చేస్తున్నాయి. ప్రాథమిక అంశాలకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు, ఎంఎస్ ఆఫీస్, పీజీడీసీఏ లాంటి కోర్సులకు రూ.2,500 నుంచి రూ.4 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వంతో ఒప్పందం మేరకు కొన్ని శిక్షణా సంస్థలు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచితంగానే బోధనలు చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 2 వేల మంది విద్యార్థులు కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందుతున్నారు.

ఉన్నత ప్రమాణాలు పెంచుకునేందుకు..



భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకునేందుకు కంప్యూటర్ శిక్షణ పొందుతున్నాం. ఉద్యోగం కోసం తీవ్ర పోటీ నెలకొన్న సమయంలో కంప్యూటర్ శిక్షణ చాలా అవసరం. అందుకే ఈ శిక్షణ తీసుకుంటున్నాను.

– కొమ్మిరెడ్డి హనుసాయికృష్ణ, విద్యార్థి

కంప్యూటర్ కోర్సుపై ఆసక్తితో..



పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్య ఎంతో అవసరం. ఉన్నత విద్యతో పాటు, కంప్యూటర్ శిక్షణ పొందుతున్నాను. సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ పొందడం ద్వారా కంప్యూటర్ కోర్సుల్లో మంచి ఫలితాలు సాధించాలనుకుంటున్నాను.

– పెద్దిరెడ్డి మాధవీ నాగదుర్గలక్ష్మి, విద్యార్థిని

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



నీలపల్లి హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణపై వివరిస్తున్న వక్తలు



భీమనపల్లిలో చిన్నారులతో కలిసి అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



భట్లపాలెం కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రామారావు



అమలాపురంలో పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



యానాం పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్పీ రాజశేఖరన్



పర్యావరణ దినోత్సవ ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులంతా పాఠశాల ప్రాంగణంలో పచ్చని మొక్కలు నాటి, నీళ్లు పోశారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తామని, మొక్కలను పెంచుతామంటూ ఉపాధ్యాయులు విద్యార్థులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డీఐఈవో గుబ్బల సూర్యప్రకాశం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి ప్రాంగణంలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని డీఐఈవో సూర్యప్రకాశం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గణిత అవధాని సూర్యనారాయణ మూర్తి, ఉపాధ్యాయులు శర్మ, బాలకృష్ణ, డీఐఈవో కార్యాలయ ఏడీ సురేష్ తదితరులు ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన అంశాలను విద్యార్థులకు వివరించారు.

ప్రతి ఒక్కరి బాధ్యత

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీఈ రామారావు కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందరూ మొక్కలు నాటి పర్యావరణన్ని కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏఓ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.దుర్గారావు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రవి సుధీర్, కళాశాలలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడాలి

ఉప్పలగుప్తం: విరివిగా చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమనపల్లి పంచాయతీ పరిధిలో సింగరాయిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ పరిసరాల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది డి.సుశీల, నాగకుమారి, లక్ష్మీదుర్గ, విజయలక్ష్మి, బాలింతలు, స్థానికులు పాల్గొన్నారు.

జీవకోటికి పర్యావరణమే ప్రధానం

తాళ్లరేవు: జీవకోటి సంరక్షణకు పర్యావరణమే ప్రధానమని, దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని రాష్ట్ర పర్యావరణ కమిటీ కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ తెలిపారు. నీలపల్లి హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక యానాం కమిటీ ఆధ్వర్యంలో బాలల వేసవి వినోద కార్యక్రమం నిర్వహించారు. బుధవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా వక్తలు పర్యావరణ పరిరక్షణ, చెట్ల ప్రాముఖ్యత తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. మొక్కలను పెంచడం, ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడం ద్వారా భూతాపాన్ని తగ్గించవచ్చని చెప్పారు. నీటిని సంరక్షించి వృక్షకాలాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేవీవీ యానాం కమిటీ ఉపాధ్యక్షుడు డి.త్రిమూర్తులు, జిల్లా చెకుముకి కన్వీనర్ ఎస్.అబ్బులు, కాశి కరుణ, సీహెచ్ వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎస్పీ

యానాం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా యానాం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్పీ రాజశేఖరన్ మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ఎస్సై మురుగనందన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. బయోడైవర్సిటీ కౌన్సిల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ వైల్డ్‌లైఫ్ ఆధ్వర్యంలో పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జోగిరాజు, ఫీల్డ్ సిబ్బంది ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జీవకోటికి పర్యావరణమే కీలకం

జీవకోటి మనుగడకు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని చెకుముకి జిల్లా కన్వీనర్ ఎస్ అబ్బులు అన్నారు. బుధవారం స్థానిక మదర్‌థెరిస్సా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వారం రోజులుగా జరిగిన బాలల వేసవి వినోద కేంద్రం ముగింపులో ఆయన మాట్లాడారు. పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఎడారీకరణ, కరువును తట్టుకునేలా శక్తిని పెంపొందించడం తదితర అంశాలపై పలువురు మాట్లాడారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జేవీవీ రాష్ట్ర ప్రతినిధి కేవీవీ సత్యనారాయణ, దుర్గాప్రసాద్, సతీష్, కుంచె సత్యనారాయణ, వి.వాసు, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు. నీలపల్లి జెడ్పీహైస్కూల్‌లో బాలల వేసవి వినోద కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. గిరియంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం దంగేటి త్రిమూర్తులు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

పర్యావరణ సేవలో ఆజాద్ బృందం



పార్కులో మొక్కలు నాటుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు

అమలాపురం టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పరిసరాలను ఆజాద్ ఫౌండేషన్‌కు చెందిన సేవా బృందం పరిశుభ్రం చేసింది. పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కాటన్ పార్కు, ఇతర ప్రాంతాల్లో పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. చెత్తను ఏరి పరిశుభ్రం చేశారు. పాలిథిన్ కవర్లు, డిస్పోజబుల్ ఖాళీ డ్రింక్ సీసాలు తదితర ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. ప్రజలంతా ప్లాస్టిక్ కవర్లకు బదులుగా, వస్త్ర సంచులు వినియోగించాలని ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధా కొండ పిలుపునిచ్చారు. అనంతరం ఫౌండేషన్ ప్రతినిధులంతా సమావేశమై, వచ్చే వానా కాలంలో పట్టణ పరిసరాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతుగా మొక్కలు నాటాలని నిర్ణయించారు. స్థానిక చంద్రశేఖర్ ఆజాద్ పార్కులో విద్యార్థులతో కలసి ఫౌండేషన్ ప్రతినిధులు మొక్కలు నాటారు. శ్రమదానం చేసిన వారిలో ఫౌండేషన్ ప్రతినిధులు అద్దాల గోపాలకృష్ణ, రంకిరెడ్డి కాశీ, కుడుపూడి శాంతి భూషణం, ఫౌండేషన్ కార్యదర్శి ఈవని విశ్వేశ్వరశర్మ, ఆకెళ్ల బుజ్జి, ఉపద్రష్ట సూర్యఫణితో పాటు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత వేదన పుస్తకావిష్కరణ



దళిత వేదన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

యానాం: నిబద్ధ ఉపాధ్యాయునిగా సేవలు అందించడమే కాకుండా, ఆనాడు దళితులు ఎదుర్కొన్న ఘటనలను పద్య, గద్య, గేయాలుగా కొల్లి వెంకన్న మాష్టారు రచించిన పుస్తకం వేదనా తరంగమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సర్కిల్ ది యానాంలో దళిత వేదన పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రముఖ కవి కథకుడు, దాట్ల దేవదానంరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వేదన పుస్తకంలోని పలు అంశాలను విశ్లేషించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొనుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ తొలిదశలో దళిత ఉద్యమంలో వెంకన్న మాష్టారి పోరాటం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్ఎఓ నామాడి అప్పారావు, విశ్రాంత ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కొల్లి సత్యనారాయణ, పిల్లి రాంబాబు, గుత్తాల శ్రీరాములు, భూషణం, కుంచే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్థూపాన్ని కూల్చిన వారిని అరెస్టు చేయాలి

తాళ్లరేవు: అమలాపురం శివారు చింతపల్లివారిపేటలో జైభీమ్ స్థూపాన్ని మోటార్ సైకిల్‌తో ఢీకొట్టిన వ్యక్తులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇద్దరు జనసేన కార్యకర్తలు మద్యం మత్తులో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని, వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దళితులపై దాడులు జరగకుండా నూతన ప్రభుత్వం కఠినమైన చట్టాలు తేవాలని కోరారు.

గురుకుల పాఠశాలల్లో దరఖాస్తులకు ఆహ్వానం



సమనస గురుకుల పాఠశాల

అమలాపురం రూరల్: అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర, రామచంద్రపురం బాలికల గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న ఖాళీలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు పిన్సిపాల్ డాక్టర్ వైటీఎస్ రాజు తెలిపారు. ఆరో తరగతిలో మత్స్యకారులు 9, బీసీ–4, బీసీసీ –1, బీసీడీ–4, బీసీఈ–3, ఇతరులు 2, ఏడో తరగతిలో మత్స్యకారులు–6, బీసీఏ–1, బీసీబీ–3, బీసీడీ–2, బీసీ ఈ–2, ఎనిమిదో తరగతిలో మత్స్యకారులు–1, బీసీడీ–1, ఎస్సీ–1, తొమ్మిదో తరగతిలో మత్స్యకారులు–20, బీసీఎ–1, బీసీబీ–1, బీసీ ఈ–1, ఎస్సీ–2, ఎస్టీ–1 ఖాళీలున్నాయని వివరించారు. అదేవిధంగా రామచంద్రపురం బాలికల గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో బీసీఎ–5, బీసీబీ–6, బీసీసీ–1, బీసీ ఈ–1, ఎస్సీ–5, ఎస్టీ–2, ఖాళీలు ఉండగా, ఏడో తరగతిలో బీసీబీ–1, ఎస్సీ–2, ఎనిమిదో తరగతిలో బీసీబీ–1, బీసీ ఈ–1, బీసీసీ–1, ఎస్సీ–2, ఎస్టీ–2, తొమ్మిదో తరగతిలో బీసీఏ–1, బీసీబీ–1, బీసీసీ–1 బీసీఈ–1, ఎస్టీ–1 ఖాళీలున్నాయని చెప్పారు. వీటి ప్రవేశ పరీక్ష ఈ నెల 20న జరుగుతుందని, అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 15లోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో సమర్పించాలని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైటీఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

కొనసాగుతున్న పోలీసుల నిఘా



రామచంద్రపురంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

అమలాపురం టౌన్: జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినా మరికొన్ని రోజుల పాటు ముందస్తు చర్యలో భాగంగా పోలీసు బందోబస్తు కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా మొబైల్ పార్టీలు, పెట్రోలింగ్, పోలీస్ పికెట్లతో నిఘా ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు అనంతరం జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, హింసాత్మక ఘటనలకు తావు లేకుండా బందోబస్తును కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు ముందు రోజు నుంచీ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్లను ఘర్షణలు, కవ్వింపు చర్యలు చెలరేగకుండా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, ఊరేగింపులు, సంబరాలు నిర్వహించరాదన్నారు. ఇందుకు గెలిచిన ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఘర్షణలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసు శాఖ తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని సూచించారు. ఎవరూ చట్టాన్ని అతిక్రమించవద్దని, అందరూ పోలీసులు విధించిన ఆంక్షల అమలుకు సహకరించాలని ఎస్పీ కోరారు.

ఎండు గడ్డికి పెరిగిన డిమాండ్

అంబాజీపేట: వరి కోత యంత్రాల ద్వారా పంటను నూర్పిడి చేయడంతో ఎండుగడ్డికి కొరత ఏర్పడింది. గతంలో రబీ పంటను కూలీలతో కోత కోసి ట్రాక్టర్‌తో నూర్పిడి చేయడంతో ఎండుగడ్డి లభించేది. అయితే ఆధునిక వ్యవసాయ పద్ధతులకు అలవాటు పడిన రైతులు పంటను నూర్పిడి చేయడానికి వరి కోత యంత్రాలను వినియోగించడంతో ఎండుగడ్డిని ఒబ్బిడి చేయడానికి రైతులు ఆసక్తి చూపించడం లేదు. ఇటీవల పశువుల ఎండుగడ్డికి డిమాండ్ పెరిగింది. దీంతో చేలల్లో పడి ఉన్న ఎండుగడ్డిని ఒబ్బిడి చేయడానికి రైతులు యంత్రాలను, కూలీలను ఉపయోగిస్తున్నారు. కొంత మంది రైతులు చేలల్లోని గడ్డిని కూలీలతో ఒబ్బిడి చేస్తుండగా, మరికొంత మంది కట్టలు కట్టే యంత్రంతో ఎండుగడ్డిని కట్టించి, గడ్డివాములు వేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో పశుపోషణ పట్ల రైతులు ఆసక్తి కనబర్చడంతో గతంలో కంటే ఈసారి చేలల్లో ఉన్న ఎండుగడ్డిని ఎక్కువగా సేకరిస్తున్నారు. ఎకరా ఎండు గడ్డి ప్రస్తుతం రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు పలుకుతుందని రైతులు అంటున్నారు. వీటితో ట్రాక్టర్ కిరాయి, కూలీల ఖర్చు కలిపి మరో రూ.1,500 నుంచి రూ.2,500 అదనంగా అవుతోందని చెబుతున్నారు.